చెంతనే గంగ - రైతుల్లో బెంగ

అరుగాలం కష్టపడుతున్న రైతన్నకు అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతున్నాయి. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వారి పరిస్థితి. ఆయకట్టు చెరువులకు సాగు నీరందించేందుకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినా.. సగం పనులు పూర్తి చేసినా ఇప్పటికీ చుక్క నీరు అందని పరిస్థితి.

- ఎడారిని తలపిస్తున్న సాగునీటి చెరువులు
- అడుగంటిపోయిన భూగర్భ జలాలు
- అర్ధంతరంగా నిలిచిన ఎత్తిపోతల పనులు


నీరు లేక ఎడారిని తలపిస్తున్న వరికుంట్ల చెరువు


తెలుగుగంగ ఎడమకాలువలో పారుతున్న నీరు

కాశినాయన : ఒక పక్క అతివృష్టి.. మరోపక్క అనావృష్టి, చీడపీడలు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు ఇలా ఏదో రకంగా రైతును నట్టేట ముంచుతున్నాయి. దీనికితోడు వర్షాభావంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బోరు బావుల్లో నీటిమట్టం తగ్గడంతో పంటలు సాగుచేయలేని పరిస్థితి. వర్షాలు అరకొరగా కురవడంతో మండలంలోని చెరువులు ఏటా ఎండుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు 'మేం అధికారంలోకి వస్తే... నెల రోజుల్లోనే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులను నీటితో నింపుతాం' అని ఎన్నికల్లో వాగ్దానాలిచ్చినా ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది.

రూ.45 కోట్లతో పనులు

మండలంలోని వరికుంట్ల, గంగనపల్లె, కొండ్రాజుపల్లె, సావిశెట్టిపల్లె, ఇటుగుల్లపాడు, గొంటువారిపల్లె, బాలాయపల్లె చెరువుల కింద ఐదు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాభావంతో పొలాలు బీడు బారడంతో 2023లో అప్పటి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పొలాలను సాగులోకి తెచ్చేందుకు ఎత్తి పోతల పథకం ఏర్పాటు చేసి నీరందించాలని నిర్ణయించింది.ఇందుకు అనుగుణంగా రూ.45 కోట్లు నిధులు మంజూరు చేసింది. తెలుగు గంగ ఎడమ కాలువ ద్వారా మొదటగా వరికుంట్ల, గొంటువారిపల్లె, బాలాయపల్లె, గంగనపల్లె చెరువులకు నీరందించేందుకు పైపులైన్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి.

70 శాతం పూర్తయిన పనులు ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయాయి. అప్పట్లో పనులు పూర్తిచేసిన గుత్తేదారుకు రూ.7కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఆ నిధులు మంజూరైతే పని పూర్తిచేస్తానని ఆయన చెబుతున్నారు. ఎటు దిరిగీ.. రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పక్కనే నీరున్నా..

బ్రహ్మం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. పక్కనే ఈ నీరు ఆ పల్లెల మీదుగా వెళుతున్నా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు బావుల్లో నీరు రాకపోవడంతో కొంతమంది రైతులు వ్యవసాయం చేయలేక హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వలస వెళ్లారు. మరింత మంది వర్షాధారంగా అరకొర పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి చెరువులకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలి



ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి చెరువులకు నీరు అందించాలి. దీంతో బోరుబావుల్లో నీటిమట్టం పెరిగి పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రజా ప్రతినిధులు చెరువులకు నీరందించే దిశగా చర్యలు తీసుకోవాలి.

జి.సిద్ధారెడ్డి, రైతు, గంగనపల్లె, కాశినాయన మండలం

బోర్లు ఎండిపోయాయి



బోరుబావుల కింద పంటలు సాగు చేద్దామనుకుంటే నీరు అడుగంటిపోయి పైకి రావడం లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు అందిస్తే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకుని చెరువులకు నీరందించాలి.

- కె.రవీంద్రారెడ్డి, రైతు, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

క్లుప్తంగా

ఉచిత ఆధార్ కేంద్రం


ఆధార్ కేంద్రం పరిశీలిస్తున్న ఎంపీడీఓ దివిజా సంపతి

ఖాజీపేట : ఉచితంగా సేవలందిస్తున్న ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దివిజాసంపతి వినియోగదారులను కోరారు. ఖాజీపేట-2 సచివాలయంలో మంగళవారం ఉచిత ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలలో ఆధార్‌లో మార్పులు చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. 23న అప్పనపల్లె, నాగసానిపల్లెలో 24న పత్తూరులో 25న తవ్వారిపల్లెలో ఆధార్ కేంద్రాలుటాయని తెలిపారు.

చాపాడు : మండలంధిలోని లక్ష్మీపేట సచివాలయంలో బుధవారం ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటుచేయనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రామానుజం తెలిపారు. 24న వెదురూరు, 25న చాపాడు సచివాలయాల్లో ఈ ఆధార్ శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌లో పేర్లు, అడ్రస్‌లు పుట్టిన తేదీ సరి చేసుకోవడ, బయోమెట్రిక్ అప్డేట్‌తోపాటు మొబైల్ నెంబర్ నమోదు చేయించుకోవచ్చని తెలిపారు.

యూటీఎఫ్ కమిటీలో మైదుకూరు ఉపాధ్యాయులు


వై.రవికుమార్


బి.ప్రసన్న లక్ష్మీ

మైదుకూరు : కడపలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో వనిపెంట జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు వై.రవికుమార్‌ను యూటీఎఫ్ సహ అధ్యక్షుడిగా, మైదుకూరు బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బి.ప్రసన్నలక్ష్మీ జిల్లా కార్యదర్శిగా మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఐఆర్, సీపీఎస్‌పైన నిర్ణయం తీసుకోవాలని, పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. వారి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు ఫైరోజ్ బాషా, అనిల్‌కుమార్, చంద్రమోహన్, గంగులయ్య, ఈశ్వరయ్య, హిమశైలజ, సుధాకర్‌రావు, సావుల్లా, రమణారెడ్డి, శివకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి స్ఫూర్తి పురస్కారం


స్ఫూర్తి పురస్కారం అందుకుంటున్న వెంకటరమణారెడ్డి

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పాలకొలను వెంకటరమణారెడ్డికి స్ఫూర్తి పురస్కారం లభించింది. పదిహేడేళ్లు సైన్యంలో సేవలందించడమే గాక, వివేకానంద ఫౌండేషన్‌లో వెంకటరమణారెడ్డికి సేవలను మెచ్చి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులను, సైనికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని లింగాపురం జర్నలిస్టు కాలనీలో మంగళవారం డ్రైనేజీ కాల్వల నిర్మాణాలకు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డుకు ఇరువైపులా రూ.8 లక్షలతో డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, వార్డు సభ్యుడు హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం


మాట్లాడుతున్న మస్తాన్

పోరుమామిళ్ల : ఈ నెల 31వ తేదీన ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 31న అన్ని మండల కేంద్రాల్లో జెండా ఎగురవేసి, సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడి 44 చట్టాలను సాధించిన ఘనత ఏఐటీయూసీదే అన్నారు. ఈ కార్యక్రమంలో వీరయ్య, సఫా, కేశవ, చాంద్‌బాషా పాల్గొన్నారు.

చేదు చిక్కీలు.. సన్నని గుడ్లు


బాలికోన్నత పాఠశాలలో ఉన్న చిక్కీల బాక్సులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని బాలికోన్నత ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందజేస్తున్న చిక్కీలు కాలం చెల్లిపోయాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అవి తిని చూస్తే చేదుగా ఉన్నాయని తెలిపారు. నాణ్యత లేని సన్నని గుడ్లు ఇచ్చారని చెప్పారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

డంపు యార్డు పరిశీలన


వర్మీ కంపోస్టు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని డంపుయార్డును మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మంగళవారం పరిశీలించారు. అక్కడ లెగసీ వేస్ట్ తొలగించేందుకు ఏర్పాటుచేస్తున్న మిషనరీని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. గంగమ్మ దేవాలయం వీధిలో చెత్త పాయింట్‌ను సందర్శించి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డులో కంబస్టబుల్ వేస్‌ను దాల్మియా ఫ్యాక్టరీకి పంపు విధానం, వర్మీ కంపోస్టింగ్ విధానాన్ని ఆయన పరిశీలించారు.

ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వండి సారూ..


తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : ఇటుకల బట్టీలకు ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వండి సారూ అంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. మండల తహసీల్దారు గంగయ్యను సీపీఐ నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో 65 నుంచి 80 వరకు ఇటుకల బట్టీలున్నాయని, వాటిలో వందలాది కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం చెబుతుంటే ఇక్కడ పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. కార్మికులకు ఉపాధి లేకుండా రోడ్డునపడే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


రైతులతో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ

మైదుకూరు: వేరుశనగ సాగులో మెలకువలు పాటించి రైతులు అధిక దిగుబడి సాధించాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. మృత్తిక శాస్త్ర విభాగ క్షేత్ర ప్రదర్శనలో భాగంగా కేంద్రంలో మంగళవారం కమలాపురం మండల రైతులకు కదిరి లేపాక్షి కె.1812, నిత్య హరిత ఐసీజీఎస్ 1157 విత్తనాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వేరుశనగలో వచ్చే చీడపీడల నివారణ చర్యలను, విత్తన శుద్ధి, పోషక, నీటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. సకాలంలో తమకు విత్తనాలను అందించినందుకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

29 నుంచి రాష్ట్ర కమిటీ సమావేశాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : ఈ నెల 29, 30వ తేదీల్లో కడప నగరంలో జరగనున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో సంబంధిత కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎ.ఎ.రహీమ్ హాజరవుతారని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని అమరావతికి తరలించడంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ కార్యదర్శి బాలగురయ్య, మహిళా కో కన్వీనర్లు నాగలక్ష్మి, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు


ఎస్.ఆర్.శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ

బద్వేలు అర్బన్ : పేదల సంక్షేమానికి, ఆదివాసీల సంరక్షణకు అనేక పథకాలు రూపకల్పన చేసిన పేదల పక్షపాతిగా ఎస్.ఆర్.శంకరన్ పేరు సంపాదించారని ఆర్డీఓ చంద్రమోహన్ అన్నారు. దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ జయంతిని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మానవతా విలువలను మనస్సు నిండా నింపుకొని ఐఏఎస్‌కే వన్నెతెచ్చిన మహనీయుడు శంకరన్ అన్నారు. అంతకు ముందు శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిచ్చయ్య, పి.వెంకటరమణ, కేశవయ్య, ఓఎస్వీ.ప్రసాద్, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

వరి రైతులకు సూచనలు


మెలకువలను వివరిస్తున్న శాస్త్రవేత్త వీరయ్య

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలో కాటుక తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లేదా ప్రొపికొనజోల్-1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పావని, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ

బి.కోడూరు: వరి పంటలో సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. మండలంలోని ఐత్రంపేట, మున్నెల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నూతన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని, వరిలో ఎక్కువగా కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, ఏహెచ్ఏ దినేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో..

గోపవరం: మండలంలోని శ్రీనివాసపురంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ వరిపంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గమనించానని తెలిపారు. రసం పీల్చే పురుగులున్నాయని, నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. ఎకరాకు 25 కిలోల చొప్పున పొటాష్ వాడాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పంటలకు వ్యాపించే తెగుళ్లపై వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

రెక్కల పురుగులతో పంటకు నష్టం

చాపాడు : వరి పైరులో రెక్కల పురుగుతో రైతులు అప్రమత్తంగా ఉండకపోతే నష్టపోతారని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వీరయ్య పేర్కొన్నారు. మండలంలోని ఖాదరపల్లె, పల్లవోలు గ్రామాలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. హాజరైన శాస్త్రవేత్త వీరయ్య మాట్లాడుతూ.. వరి పైరుకు చీడ పీడలు రాకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రెక్కల పురుగు, దోమ నివారణకు అసిఫెట్ మందు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇ.మ్యాగీ, జైనుల్లా, రామోహన్, గిరిధర్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని సంజీవ నగర్‌కు చెందిన చిన్న కుళ్లాయమ్మ, నాగరాజు దంపతులు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. వారికి ముగ్గురు పిల్లలున్నారు. వారు తమ పెద్దమ్మ పెద్ద కుళ్లాయప్ప వద్ద ఉంటున్నారు. ఈ సందర్భంగా వారికి ఆర్థికసాయంగా చల్లా రాజగోపాల్ అందించిన రూ.5వేలు చలపతిరావు, చింతా మోహన్, ఖాదర్‌వలి, రాగాల రమణయ్య, శంకర్, నాగన్నలు పెద్ద కుళ్లాయమ్మకు అందజేశారు.

నేడు, రేపు భూ రీసర్వేపై గ్రామసభలు

చాపాడు : చాపాడు సచివాలయం వద్ద బుధ, గురు వారాల్లో భూ రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. చాపాడు రెవెన్యూ పరిధిలో జరిగిన భూ రీసర్వేలో ఎలాంటి తప్పిదం జరిగినా ఫిర్యాదు చేయవచ్చని తహసీల్దారు తెలియజేశారు.

25న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

పోరుమామిళ్ల : రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు వస్తారని, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ విద్యార్థులు మేళాకు హాజరుకావచ్చునని కోరారు.

నేడు తలనీలాల వేలం

పోరుమామిళ్ల : ప్రసిద్ధ మద్దిమాను గురప్ప స్వామి దేవస్థానంలో బుధవారం తలనీలాల వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి నరసయ్య తెలిపారు. లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. అన్య మతస్థులు వేలంలో పాల్గొనరాదన్నారు.

ఆంధ్ర విద్యార్థి సంఘం కన్వీనర్‌గా ప్రహల్లాద్

బద్వేలు అర్బన్ : ఆంధ్ర విద్యార్థి సంఘం బద్వేల్ నియోజకవర్గ కన్వీనర్‌గా ప్రహల్లాద్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అశోక్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు.

ఉప విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని నిరసన


ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీఎస్‌వైఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్పపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు మాట్లాడుతూ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో కృష్ణప్ప అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేసినా ఆయన స్పందించరని తెలిపారు. డివిజన్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయని, ఆ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు వివిధ అవసరాల కోసం ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయానికి వస్తుంటారని తెలిపారు. కార్యాలయంలో సీసీ కూడా లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌వైఎఫ్ నాయకులు బయన్న, శీను, ఎమ్మార్పీఎస్ నాయకురాలు చెన్నమ్మ, నరసింహులు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలో యువతకు అవకాశాలు


అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

బద్వేలు అర్బన్ : భారతీయ సాయుధ సేవల్లో యువతకు అద్భుత ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆర్మీ అధికారులు సందీప్, సురేందర్ పేర్కొన్నారు. స్థానిక రాచపూడి ఫంక్షన్ హాల్‌లో భారత వైమానిక దళంలో అగ్నిపథ్, అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌పై సదస్సు జరిగింది. రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేయు విధానం, ఎంపిక ప్రక్రియ, ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చే శిక్షణ తదితర అంశాలపై రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు వారు మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అగ్నివీర్, అగ్నిపథ్ పథకాల్లో ఉద్యోగాలు పొందిన యువత అర్హతను బట్టి ఆర్మీ, వైమానిక దళం, నేవీలో పని చేయవచ్చని, తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున జీతం చెల్లిస్తారన్నారు. దీంతోపాటు ప్రతి నెలా కొంత మొత్తాన్ని తీసుకుని కార్పస్ ఫండ్‌లో జమ చేస్తారని తెలిపారు. నాలుగేళ్లలో జమ అయిన రూ.5.02 లక్షలకు అదనంగా నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం రూ.11.71 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. సైన్యంలో ఉంటూ ఏ విధంగా చనిపోయినా రూ.48 లక్షల బీమా ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చనిపోతే రూ.44 లక్షల ఎక్స్‌గ్రేషియా అదనంగా చెల్లిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థినులతో వివేకానంద ఫౌండేషన్ సభ్యులు

బి.కోడూరు : తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుంటే.. చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చునని వివేకానంద ఫౌండేషన్ గౌరవ సలహాదారు రాజోలి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాసానగరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'నైతిక విలువలు - తల్లిదండ్రుల ప్రాముఖ్యత' అంశంపై పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు ఆయన అందజేశారు. పర్యావరణవేత్త ఆర్.ఆర్.రాజు మాట్లాడుతూ ప్రకృతిని అమ్మానాన్నల కంటే ఎక్కువగా ప్రేమించాలన్నారు. వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, వెంకటరమణారెడ్డి, జయరామ్, ఉపాధ్యాయనీలు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి


ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : ఇంటర్మీడియట్ విద్యార్థిని దస్తగిరమ్మను హత్య చేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్ పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం మానవహారాన్ని ఏర్పాటుచేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై నిత్యం దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుని నిందితుడికి కఠినశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. దస్తగిరమ్మ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, హరిశంకర్, నవీన్, మనీష్, చంద్ర పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో బాలికలపై జరుగుతున్న అత్యాచారాల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రవిచంద్ర పేర్కొన్నారు. తమ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలిక దస్తగిరమ్మను హత్య చేసిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి, రామసుబ్బమ్మ, వెంకటయ్యలు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..

మైనర్ బాలికను హత్య చేసిన ప్రేమోన్మాది విఘ్నేష్‌ను శిక్షించి బాధిత విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కేవీపీఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాయప్ప, నరసింహులు పేర్కొన్నారు. సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థినులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని తెలిపారు.


మాట్లాడుతున్న ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నాయకులు

ప్రొద్దుటూరు : బద్వేల్‌లో బాలికను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, సత్తార్, పుల్లయ్య, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. తమ కార్యాలయంలో వారు మాట్లాడుతూ విద్యార్థిని దస్తగిరమ్మను అతి కిరాతకంగా విఘ్నేష్ పెట్రోలు పోసి కాల్చి చెప్పడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటనలను జరగకుండా ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలుచేయాలని కోరారు.కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.